

మాట్లాడుతున్న బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య

22శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లాలనే ప్రభుత్వ నిర్ణయం తగదు : ఆర్.కృష్ణయ్య

రాంనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతంకు బదులు 22శాతం అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తుందని బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు తీసుకుందని ఆరోపించారు. బుధవారం బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలకు పార్టీ ఎన్నికల గుర్తు ఉండదని అన్నప్పుడు 42శాతం ఇస్తామని ఎలా చెబుతారని ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ రిజర్వేషన్లను 22శాతానికి తగ్గించి ఎన్నికలకు పోవాల్సిన అవసరం ఏమిటని అన్నారు. ఓ వైపు కేసు కోర్టు విచారణలో ఉండగా ఎన్నికల కోడ్ తగదన్నారు. బీసీలందరు ఏకమై కాంగ్రెస్‌కి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ముషీరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో వాలీబాల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్ వద్ద కొనసాగుతున్న ఫుట్‌పాత్ నిర్మాణ పనులను శ్రీధర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక చిరు వ్యాపారులకు, వాలీబాల్ గ్రౌండ్‌కు వచ్చే క్రీడాకారులకు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే నిర్మాణ పనులు పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు ఎండీ మోహిన్, జి. రాజు, ఎస్సీసెల్ డివిజన్ అధ్యక్షుడు సదా, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సేవాశ్రమానికి అంబులెన్స్ అందజేత

కవాడిగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : అన్ని సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను లోయర్ ట్యాంక్‌బండ్‌లోని భారత్‌సేవాశ్రమానికి బంధన్‌బ్యాంకు ఆధ్వర్యంలో విరాళంగా అందజేశారు. భారత్ సేవాశ్రమంలో బుధవారం బంధన్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబులెన్స్‌ను అందజేయడం జరిగిందని బ్యాంకు స్వతంత్ర్య డైరెక్టర్ శాంతన్ ముఖర్జీ తెలిపారు. ఆరోగ్య రక్షణ సేవలు అనేవి అందరికీ అందించాలని ఇది ప్రాథమిక హక్కు అని బ్యాంకు విశ్వసిస్తుందని చెప్పారు. ఈసందర్భంగా బ్యాంకు ఎండీ అండ్ సీఈఓ పార్థప్రతిమ్ బ్యాంకు అధికారులతో కలిసి భారత్ సేవాశ్రమ్ నగర అధ్యక్షుడు స్వామి మునిశ్వరానంద, ప్రధాన కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానందలకు అంబులెన్స్ తాళాలు అందజేశారు. అంతకు ముందు భారత్‌సేవాశ్రమ్ స్వామీజీలు అంబులెన్స్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నల్లకుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : నల్లకుంట ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన 1976 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం ఆ పాఠశాలలో జరిగింది. పూర్వవిద్యార్థుల సంఘం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు పాల్గొని గత బాల్యస్మృతులను నెమరువేసుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులు శ్రీసరస్వతి సంగీత విశ్వద్యాలయం ప్రిన్సిపాల్ పోషూరి శ్రీనివాస శర్మ, విజయ్‌కుమార్, విశ్వమోహన్, జయపాల్‌రెడ్డి, గోపాల్‌కృష్ణ, షరీఫ్, వాసు, ఎన్.వి.రమణ, శ్రీనివాస్‌కర్న, ఎం.బి.కృష్ణమాచార్యులు తదితరులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ తమ అనుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా బహుమతులు అందజేసుకున్నారు.


పురస్కారగ్రహీతలు బాధ్యతతో వ్యవహరించాలి

చిక్కడపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పురస్కారాలు పొందినవారు బాధ్యతతో వ్యవహరించాలని అపోలో మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ డా. హరికుమార్ అన్నారు. బాలాజి ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో భం భం బోలే శంఖం మ్రోగెలే పేరిట పాటల ఆలాపన కార్యక్రమం బుధవారం త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక, సాంస్కృతిక సేవా రత్న పురస్కారాలను వివిధరంగాల వర్ధమానులు, ప్రముఖులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో హరికుమార్, నిర్వాహకులు, ప్రముఖ గాయకులు టి. రామోజీ, బికె అపర్ణ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

చిక్కడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎల్ఐసీ పాలసీదారుడు, ఆలిండియా సీనియర్ ఎల్ఐసీ ఏజెంట్ కౌటికె విఠల్ ఆధ్వర్యంలో బుధవారం చౌటుప్పల్‌లోని అమ్మానాన్న అనాథాశ్రమంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండి బండారు సుబ్బారావు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో చౌటుప్పల్ ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ సత్యనారాయణ, ప్రముఖులు సైదులు, గట్టు శంకర్, కౌటికె కావ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో అధ్వానంగా మారిన రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు కార్పొరేటర్ కె.రవిచారి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని బాకారం వెస్లీ చర్చి, పవిత్రనగర్, హరినగర్, జెమినీకాలనీ, దయారా మార్కెట్ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి వెంటనే నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. వెంటనే తగిన నిధుల మంజూరుకు కృషి చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన విద్యార్థులు



చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులతో కళాశాల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

రాంనగర్ : ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల విద్యార్థులు సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఎల్‌బిస్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల నుంచి ఉమెన్స్ పోటీలో రిషిక గోల్డ్‌మెడల్ సాధించగా వైష్ణవి, సోనిలు సిల్వర్ మెడల్స్, రిషిత బ్రాంజ్ మెడల్ సాధించగా వాణి, అరుణలు నాల్గవ స్థానంలో గెలిచారు. మెన్స్ విభాగంలో కార్తీక్ గోల్డ్ మెడల్, విఘ్నేష్‌సింగ్ సిల్వర్ మెడల్, అజయ్, ఆయాజ్‌లు బ్రాంజ్ మెడల్ సాధించగా వెంకటేష్ నాల్గవ స్థానంలో నిలిచారు. వీరిని కళాశాల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి, డైరెక్టర్ యాదగిరి, ప్రిన్సిపాల్ ఎం.శేఖర్, మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్, ఎం.శ్రేణిక్‌లు సన్మానించి అభినందించారు.



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, పూస రాజు తదితరులు



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



భోలక్‌పూర్ భవానీశంకర ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్ దంపతులు

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

రాంనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పూస స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం జెమినీకాలనీలో శివపార్వతుల కల్యాణమహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ఎదుర్కోలు, దీపోత్సవం, పల్లకీసేవ, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పూస రాజు, శ్రీకృష్ణ, బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, యువజన నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ నాయకులు మద్దూరి శివాజీ, రాంరెడ్డి, జెమిని కాలనీవాసులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లోని భవానీశంకర ఆలయంలో..

ముషీరాబాద్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భోలక్‌పూర్‌లోని భవానీశంకర ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్ దంపతులు కల్యాణమహోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సురేష్, సాగర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణోత్సవంలో పూస స్వామి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

చిరువ్యాపారులకు ఆటంకం కలిగించొద్దు : ఎమ్మెల్యే

కవాడిగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కు ధర్నాచౌక్ పరిసరాల్లో చిరువ్యాపారాలతో జీవనోపాధి పొందే వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. రెండు, మూడు రోజులుగా ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వీధి వ్యాపారాలు, ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై ట్రాఫిక్‌పోలీసులు చలాన్లు విధిస్తూ షాపులను తొలగించాలని ఆదేశాలు జారీచేయడంతో వ్యాపారులు ఎమ్మెల్యే గోపాల్‌ను ఆశ్రయించారు. దీంతో బుధవారం ఆయన వివిధ శాఖల ట్రాఫిక్, పోలీసు, జీహెచ్ఎంసీ, డీఈ సన్నీ, హైడ్రా అధికారులతో కలిసి ఇందిరాపార్కు ధర్నాచౌక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇందిరాపార్కు వద్ద వ్యాపారాలు చేసుకునే నిరుపేదలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తాము ఇక్కడే వీధి వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నామని అన్నారు. కూరగాయలు, పండ్లు వ్యాపారం చేసుకునే వారితో పాటు భోజనం అమ్ముకునే వ్యాపారులపై కూడా ట్రాఫిక్‌పోలీసులు ఇష్టారాజ్యంగా చలాన్లు విధిస్తూ అక్కడనుంచి వెళ్లిపోవాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈసందర్భంగా అక్కడే ఉన్న ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి, దోమలగూడ సీఐ అంజద్‌అలీ మాట్లాడుతూ ఇందిరాపార్కు వద్ద వ్యాపారాలు చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని మాత్రమే సూచించామని వారు ఎమ్మెల్యేకు వివరించారు. కొంతమంది ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలు చేపట్టి షెడ్లు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా అందులో వ్యాపారాలు నిర్వహించకుండా రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుందని ట్రాఫిక్ పోలీసులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరాపార్కు వద్ద చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ, ట్రాఫిక్ ఎస్ఐ కార్తీక్‌గౌడ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యాంయాదవ్, నాయకులు కల్వ గోపీ, ఆర్ రాంచందర్, రాజేష్, రాములు, రమేష్ పాల్గొన్నారు.



చిరువ్యాపారులకు ఇబ్బందులు కలిగించొద్దని అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

కవాడిగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం ఇందిరాపార్కులోని ఆమె విగ్రహం వద్ద కాంగ్రెస్ ముషీరాబాద్ ఏ బ్లాక్ అధ్యక్షుడు విడి కృష్ణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంజన్‌కుమార్‌యాదవ్ ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ, గరిబీహటావో నినాదంతో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, భూములను పంపిణీ చేసిన ఘనత ఇందిరాగాంధీది అన్నారు. ఇందిరాగాంధీ హయాంలోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని అన్నారు. ఆమె ఆశయ సాధనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్లు కెఆర్‌కె ప్రసాద్, మేడి సురేష్, మాజీ కార్పొరేటర్లు ఆర్ కల్పనా యాదవ్, వాజిద్ హుస్సేన్, కవాడిగూడ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, నాయకులు ప్రభాకర్, వెంకటేష్, రమేష్‌యాదవ్, సత్యనారాయణ, బాబురావు, రాము పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, విడి కృష్ణ, ఆలయ చైర్మన్ కెఆర్‌కె ప్రసాద్

శారదామహిళామండలి స్వర్ణోత్సవాలు

చిక్కడపల్లి : అశోక్‌నగర్‌లోని శ్రీ శారదామహిళామండలి స్వర్ణోత్సవాలు బుధవారం రాత్రి అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ నూతన భవనం ఆవరణలో ఘనంగా జరిగాయి. శారదామహిళామండలి ఏర్పాటు చేసి 50సంవత్సరాలు అవుతున్న సందర్భంగా సంస్థ సభ్యులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఈ యాభై సంవత్సరాల్లో మండలి చేసిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాసాని సూర్యప్రకాష్, అంజిబాబు, శివన్నాయుడు తదితర కార్యవర్గసభ్యులను సన్మానించారు. ప్రముఖ విద్యావేత్తలు డా. జి. సుధ, డా. ఓ. భాగ్యలక్ష్మి, ప్రముఖ వైద్యులు డా. స్వాతి యడవల్లి మాట్లాడుతూ శ్రీశారదామహిళామండలి స్థాపించి స్వర్ణోత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషకరమైన అంశం అన్నారు. శ్రీశారదామహిళామండలి అధ్యక్ష, కార్యదర్శులు మార్టూరి శేషమ్మ, ఎల్. వి. కృష్ణవేణి, కోశాధికారి జె. లలితలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జి. పద్మావతి, గీతారావు, కమల, సుబ్బలక్ష్మి, స్వరూపరాణి పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపేందర్‌రెడ్డి, పద్మజ, ఉద్యోగులు

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

చిక్కడపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో స్వశక్తితో రాణించి అభివృద్ధి చెందాలని హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. బుధవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి, పద్మజ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులు పాఠకులకు మరిన్ని విలువైన గ్రంథాలయ సేవలు అందించాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే అన్నిరంగాల్లో ముందుకు రావడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రంగంలో పురుషులతో సమానంగా మహిళలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఉద్యోగినులు, విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వచైర్మన్ కోదాటి నారాయణరావు వర్ధంతి సందర్భంగా లైబ్రరీ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు చంద్రకళ, సుబ్బలక్ష్మి, ప్రతిభారెడ్డి, సీతామహాలక్ష్మి, వెంకటేష్‌యాదవ్, అవినాష్‌రావు, రామ్మోహన్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బొల్లం మహేందర్, జంగారెడ్డి, మహేష్, శ్రీకాంత్, మహేశ్వరి, అమరావతి, భాగ్యలక్ష్మి, అశోక్, సునీత, పోటీపరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతి వేడుకలు

చిక్కడపల్లి : జాతీయ సంగీత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలు బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగాయి. ఈసందర్భంగా గాంధీ, ఈఎన్‌టీ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు వాణిదేవి, ఆనంద్‌ఆచార్య, ఇతర వైద్యులు నాగవర్ధన్‌బాబు, హరిప్రియ, ప్రేమానందరావు, రమేష్, బాలు, సంగీత కళాకారులు డీవీమోహనకృష్ణలను ఎంపీ ఈటల రాజేందర్ సన్మానించారు. రాజేందర్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో వైద్యులు చేసిన సేవ ఎంతో గొప్పదన్నారు. వైద్య వృత్తి వ్యాపారంగా కాక సేవాప్రవృత్తిగా భావించాలని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి అన్నారు. సంస్కారభారతి అధ్యక్షుడు కె కె శర్మ మాట్లాడారు. సంస్థ అధ్యక్షుడు ఎల్ వి చెన్నారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించి సమన్వయం చేశారు.


బీజేపీ రాష్ట్ర నాయకుడు విశ్వం మృతి

ముషీరాబాద్ : ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ విశ్వం (69) బుధవారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా డయాలసిస్‌తో బాధపడుతున్నాడు. నాంపల్లిలోని కేర్ ఆస్పత్రిలో డయాలసిస్ చేస్తుండగా ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, నలుగురు కూతుర్లు ఉన్నారు. 2020లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయాడు. పార్టీ క్రమశిక్షణ కార్యకర్తగా పనిచేస్తూ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌కు నమ్మిన బంటుగా ఎదిగాడు. బీజేపీ నాయకులు నందగిరి నర్సింహ, బిజ్జి కనకేష్‌కుమార్, రాజశేఖర్ తదితరులు వారి ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. విశ్వం అంత్యక్రియలు ముషీరాబాద్‌లోని హిందూ శ్మశానవాటికలో గురువారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తామని ఆయన కుమారుడు రాజేష్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బర్కత్‌పుర : వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో 50ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీఆర్ఎస్ నేత బోయపల్లి లింగంగౌడ్ మృతి



లింగంగౌడ్(ఫైల్)

గోల్నాక: గోల్నాక డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయపల్లి లింగంగౌడ్(66) మంగళవారం రాత్రి మృతి చెందాడు. లింగంగౌడ్ తన ద్విచక్ర వాహనంపై శివంరోడ్ వైపు వెళ్లి తిరిగి వస్తుండగా కిందపడడంతో గాయాలు కాగా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లింగంగౌడ్ బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు అతి సన్నిహితుడుగా కొనసాగుతున్నాడు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నగరంలో లేకపోవడంతో విషయం తెలియగానే ఎమ్మెల్యే సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ దంపతులు, పార్టీ నాయకులు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని దగ్గరుండి పరిశీలిస్తుండగా వైద్యులు మృతి చెందాడని చెప్పగా వెంటనే అక్కడి నుంచి గోల్నాక డివిజన్ న్యూగంగానగర్‌లోని ఆయన నివాసానికి మృతదేహన్ని తీసుకవచ్చారు. బుధవారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు, సన్నిహితులు, గౌడసంఘం పెద్దలు, బీసీ సంఘాల నాయకులు ఆయన నివాసానికి తరలివచ్చి నివాళ్లు అర్పించారు. లింగంగౌడ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. లింగంగౌడ్ పార్థీవదేహంపై ఎమ్మెల్యే సతీమణి కాలేరు పద్మావెంకటేష్ బీఆర్ఎస్ జెండాను కప్పి నివాళ్లు అర్పించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యే తనయుడు కాలేరు మణికాంత్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు. హ్రాస్‌సెంటలోని అంబర్‌పేట హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.



మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం ఇస్తున్న ప్రవీణ్, రంగారావు, నర్సయ్య

హెల్త్‌కార్డులు ఇవ్వాలని మంత్రి రాజనర్సింహకు వినతి

రాంనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 33 జిల్లాల్లో రియల్ ఎస్టేట్ అసోసియేట్స్‌లో పనిచేస్తున్న సభ్యులందరికీ ప్రభుత్వం హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహకు తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నర్సయ్య బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్‌కు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, తెలంగాణ జిల్లాల్లో, పట్టణ ప్రాంతాల్లో, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలను రక్షించడానికి చర్యలు చేపట్టాలని మంత్రిని కోరామన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ సమగ్రమైన సమాచారం నివేదిక ఇస్తే హెల్త్‌కార్డుల అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మణ్‌రావు, బొమ్మ వెంకటేశ్వర్లు, పి.రమేష్, పి.వనజ, జైపాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మక్బుల్ అహ్మద్, అబ్దుల్ ఆలీం, వినోద్‌కుమార్, కోట రాజు, రాజేష్, శశి పాల్గొన్నారు.

సుందరయ్యపార్కు అభివృద్ధికి సహకరిస్తాం

రాంనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు అభివృద్ధికి, వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీకి తమవంతు సహకారం అందిస్తామని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికైన ఎస్.మనోహర్‌రెడ్డిని బుధవారం ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, పి.వి.నిరంజన్‌రెడ్డి, ఎస్.రమేష్‌రెడ్డి, మురళీకృష్ణ, శైలజమోహన్, సంతోష్‌గౌడ్, ఆర్.వివేక్, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదానాన్ని మించిన సేవ మరోటి లేదు

చిక్కడపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నదానాన్ని మించిన సేవ మరోటి లేదని చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్ అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా బుధవారం కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం గేట్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని శాశ్వత అన్నదాతలు ప్రొద్దుటూరి నరసింహారావు, తమ్మన వేణుగోపాలరావు, మద్దుల మాధురిదేవి జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎంఆర్‌వీ సుబ్రహ్మణ్యం, ఫ్యామిలీ సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేష్, కోశాధికారి తొడుపునూరి రవీందర్, మామిళ్ల శ్రీనివాస్, గంప భిక్షపతి, మోహన్ కుమార్, జిల్లా ఆంజనేయులు, రమేష్, కేవీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

నిరుద్యోగుల నిరసన

చిక్కడపల్లి: ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు వెరైటీ విధానంలో నిరసన తెలిపారు. చిక్కడపల్లిలోని సిటి సెంట్రల్ లైబ్రరీలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. నిరుద్యోగులు ఈ కార్యక్రమంలో నోటిఫికేషన్‌తో పాటు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వి వాంట్ జాబ్ క్యాలెండర్ అని రాసి ముగ్గులు వేసి రంగులు అద్ది తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నేతలు కయ్య వెంకటేష్, బాలకోటి, మధు, కుమార్, దామోదర్, సంపత్, గణేష్, కిరణ్, నరేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి : ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ 1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. రామాలయం, ఎల్ఎన్‌నగర్, ప్రివెంటివ్ మెడిసిన్, అంజయ్యభవన్, భోలక్‌పూర్, గోశాల, ఈనాడు, గాంధీనగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయిబాబా టెంపుల్, శంకర్‌మఠ్, నారాయణగూడ, తాళ్లబస్తీ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

బర్కత్‌పుర, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత విద్యార్థుల సామాజిక బాధ్యత అని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి సూచించారు. బుధవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు మైదానంలో శ్రమదానం చేశారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో విద్యార్థులు తమ బాధ్యతగా భావించాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇతర విద్యార్థులకు అన్ని విధాల్లో రోల్‌మోడల్‌గా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కామర్స్ లెక్చరర్స్ ఎం.నర్సిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్ల పోలింగ్ జాబితాను సమర్పించాలి



మాట్లాడుతున్న డీఎంసీ రామానుజులరెడ్డి

రాంనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలన్నీ పోలింగ్ బూత్ ఏజెంట్ల జాబితాను వెంటనే సమర్పించాలని డీఎంసీ రామానుజులరెడ్డి సూచించారు. బుధవారం అబిడ్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 105 భవనాల్లో 274 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ఏజెంట్‌ను అన్ని రాజకీయ పార్టీలు నియమించి ఆ జాబితాను వెంటనే సమర్పించాలని సూచించారు. ఆ జాబితాను ఎన్నికల కమిషన్‌కు పంపించాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలో 3,09,823 ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 1,58,332, మహిళలు 1,51,477, ఇతరులు 14 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఒక ఇంటిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, డబుల్ ఓట్లు ఉన్నాయా?, చనిపోయిన వారు ఎంత అనే అంశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, అడిక్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల్, ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాం, బీఆర్ఎస్ నగర నాయకుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ ఒక ఇంటిలో 50 మంది కంటే ఎక్కువ ఓట్లు ఉంటే ఆ ఇంటిపై విచారణ జరిపించాలన్నారు.